# ఊరుమ్మడి బతుకులు

'ఓ గన్నెయ్యగోరా!.... రేపు సందాలకి ఈ కొడవలి గిద్దలకి కక్కు_లుకోసి సిద్ధం సెయ్యమన్నాడు మా కాపు' అంటూ ఓ డజను కొడవళ్ళను కొలిమిముందు కూర్చున్న కమ్మరి గన్నెయ్య ముందు పడేసాడు నరసయ్యకాపు పాలేరు సుబ్బడు.

"ఇదేమన్నా నవిలేదా? మింగేదా? రేపు సందాళకి ఎట్టా సిద్ధమౌతాయ నుకున్నాడేటి మీ కాపు? ఎల్లుండి సందాలక్కా_ని కావని సెప్పు" అన్నాడు గన్నెయ్య.

"అదంతా నాకు తెల్దయ్యోయ్. కాపు సొప్పమన్నది సొప్పాను. అంతే"

"సొప్పావుగా. ఇంకెల్లిరా" అన్నాడు గన్నెయ్య కాలిన ఇనుపముక్క_ను సమ్మెటతో బాదుతూ.

గన్నెయ్య మాటలోని వెటకారాన్ని అర్థంచేసుకున్న గన్నెయ్యభార్య రత్నం ఫక్కు_న నవ్వింది.

అవ్వూరి మధ్య వున్న ఊరుమ్మడి కమ్మరి సావిడి, తాతయ్య కాపు ఊరిపెత్తనం చెలాయించే రోజుల్లోకట్టబడింది. తాతయ్య కాపు బతికున్న రోజుల్లో, ఊరుమ్మడి డబ్బుతో ఆ సావిడి కట్టించి, వ్యవసాయం పనిముట్లు తయారుచేయడం కోసం కమ్మరి వెంకన్నను తీసుకొచ్చి ఆ సావిట్లో పెట్టాడు. తాతయ్య కాపు బతికి వున్నన్నాళ్ళూ తల్లో నాలికలా కమ్మరి వెంకన్న ఆ వూళ్లో రోజులు దొర్లించాడు. తాతయ్య కాపు పోయిన కొన్నాళ్ళకి వెంకన్న కన్నుమూసాడు. వెంకన్న కన్ను మూసిన తరువాత వెంకన్న కొడుకులకీ ఆ వూరికీ పొసగలేదు.

రోజులు మారడంతోపాటు మనుషులు మనస్తత్వాలు కూడా మారడంతో, పాతజులుం చెలాయిస్తున్న ఆ వూరి కామందుల తాకిడికి తట్టుకోలేక, వెంకన్న కొడుకులు సావిడి ఖాళీచేసి బతుకు తెరువుకోసం పట్టణానికి వెళ్లిపోయారు.

ఓ ఏడాదిపాటు ఖాళీగావున్న సావిట్లో గన్నెయ్యని తీసుకొచ్చి పెట్టారు ఊరు పెద్దలు.

ఓ పెద్ద తాటాకు మోరపాక, లోపలికి ఓ చిన్నగది, అదే కమ్మరి సావిడి. ఆసావిట్లో గన్నెయ్య.

గన్నెయ్యను ఊరంతా 'కమ్మరి గన్నెయ్య' అని పిలిచినా అతను కమ్మరి పనీ, వడ్రంగిపనీకూడా చెయ్యాలి. రెండు పనులూ అతను చేయగలడు.

ఆ సావిడి ముందు ఓ పెద్ద చింతచెట్టు, ఆ చింతచెట్టు కింద పాడయిపోయిన రెండెడ్లబండ్లూ, నాగళ్లూ, తుమ్మదుంగలూ పడి ఉంటాయి. ఆ చెట్టునీడలోనే

కమ్మరికొలిమి. చింతచెట్టుకు చేరవేసి సమ్మెట్లూ, బాడితలూ, ఇనుపముక్కలూ, గొడ్డళ్లూ బళ్ళయిరుసులూ, పాడయిపోయిన కొడవళ్లు, కత్తులూ, గునపాలు ఉంటాయి.

ఆ కొలిమి దగ్గర యజమానీ నౌకరూ గన్నెయ్యే. యెవరి పని చేస్తూ వుంటే వాళ్ళ పాలేరు ఊదుడుతిత్తితో కొలిమిని రాజబెడుతూ వుంటాడు. గన్నెయ్య పొద్దుటినుంచీ సాయంత్రం దాకా ఆ కొలిమి ముందు కూర్చుని, కొలిమిలో కాలిన ఇనుపముక్కల్ని పట్టకారుతో అటూయిటూ తిప్పుతూ అవసరమైనప్పుడు ఇనుపముక్కల్ని ఇనుప దిమ్మమీద పెట్టి సమ్మెటతో బాది సాపుచేస్తూ వుంటాడు. లేకపోతే బాడిత చేతబట్టి తుమ్మదుంగల్ని మారుజాతి కర్రల్ని చెక్కి సాపుచేస్తూ వుంటాడు. పనిచేసుకుంటూనే చుట్టూ ఉన్న జనంతో బాతాఖానీ కొడుతూవుంటాడు.

చెట్టుకింద పడివున్న దుంగల మీదకు ఊళ్ళో జనం చేరతారు. పొలం పనిలేని వాళ్ళు, యింట్లో పనీపాటూ లేనివాళ్ళూ, ఆకమ్మరి సావిడి దగ్గరికి చేరిపోతారు. నిజానికదో రచ్చబండ లాంటిది.

గన్నెయ్య నోరూ వాకూ లేని మనిషి. ఆ చింతచెట్టు తనకు తెలియకుండానే అందరికీ నీడ యిచ్చినట్టు, గన్నెయ్య కూడా తనకి తెలియకుండానే అందరి అవసరాన్ని తీరుస్తూ వుంటాడు. ఎప్పుడో ఏడాదికోసారి కుప్పనూర్పుడు రోజుల్లో రైతులు గన్నయ్యకి ధాన్యం కొలుస్తారు. "కొలిచినయ్య పుణ్యం కొలవనయ్య పాపం". అంతేగాని, ఎవర్నీ – "నీవు ఈ యేడు జీతం కొలవలేదేం?" అని గన్నెయ్య నోరుతెరచి అడగడు. అందుకే ఎనిమిదేళ్ళనుంచీ ఆ ఊళ్ళోనే కదలకుండా ఉండగలిగాడు.

నిజానికి ఊళ్ళో వాళ్ళు అతను పడేకష్టానికి కూలీ యిస్తున్నాం అని ఎన్నడూ అనుకోలేదు. ఆ అలవాటు వాళ్ళకు లేదు. ఊళ్ళోవాళ్ళ దృష్టిలో గన్నెయ్య ఊరుమ్మడి సావిట్లో ఊరుమ్మడి మనిషి. ఊరుమ్మడి తిండితిని ఊళ్ళోవాళ్ళ దయమీద బ్రతికే ఊరుమ్మడి మనిషి, ఊళ్ళోవాళ్ళు తనని గురించి ఏమనుకున్నా గన్నెయ్య పట్టించుకోడు. గన్నెయ్య స్వతహాగా జిమిలీ ఎముకగల మనిషి. మోటుపని చేసి బతికే మనిషేమో కండలు తిరిగి బలంగా వుంటాడతను. ఒక చేత్తో అవలీలగా ఓ పాళం దుంగని ఎత్తి పారెయ్యగలడు.

పొద్దుటినుంచి సాయంత్రందాకా ఆ కొలిమి దగ్గర కండలు కరిగేలా పనిచేసి, చీకటి పడబోయేముందు ఆ కొలిమి మీదే ఓ సోలెడు గింజలు పొంగించుకుని పక్కింటి లక్ష్మమ్మ గారినో ఎదురింట రాజమ్మ గారినో అడిగి ఏ కూరో తెచ్చుకుని రోజులు దొర్లించేసేవాడు గన్నెయ్య. అలసిపోయిన శరీరానికి నిద్రపిలవడం తడవుగా రావడంలో పెందరాళే నడుం వాల్చేవాడు. అలా ఏ చీకు చింతా లేకుండా తనను గురించి గానీ దేని గురించిగానీ ఆలోచించకుండా, హాయిగా ఆ చుట్టూ వున్న దుంగల్లో ఓ దుంగలా కాలం గడుపుకునేవాడు గన్నెయ్య.

అలాగే లక్ష్మమ్మగారు ఇచ్చిన కూరతోటీ రాజమ్మగారు ఇచ్చిన పచ్చడితోటీ, ఊళ్ళోవాళ్ళ దయాధర్మాలమీద నీళ్లూ పాలు అడగని ఊరుమ్మడి యంత్రంలా ఊరికి ఉపయోగపడుతూ గన్నెయ్య రోజులు దొర్లించేస్తే,గన్నెయ్య కథలోకి ఎక్కేవాడే కాడు.

అలా కాకుండా గన్నెయ్య జీవితంలోకి మలుపు తొంగి చూసింది. కాలానికీ, మనిషి జీవితానికీ మార్పు సహజమేమో!

"ఏడాది క్రితం పెద్దకాపు, జీతం కొలుత్తాను-కళ్ళంలోకి రారా" అని కబురంపాడు.

పొద్దున్నే ఓ ఖాళీసంచీ బుజాన వేసుకుని పెద్దకాపు గారి కళ్ళం దగ్గరకి వెళ్ళాడు గన్నెయ్య. అతను వెళ్ళేటప్పటికి పెద్దకాపు దగ్గరుండి పాలేర్లకి జీతము కొలిపిస్తున్నాడు. పెద్ద కాపు వియ్యంకుడు మడత మంచంమీద కూచుని చుట్ట కాల్చుకుంటున్నాడు. ఆయన పక్కవూరి మునసబు.

గన్నెయ్యను చూడగానే "ఏరా గన్నిగా! వొచ్చావా. ఓరే రాజిగా ఈడిక్కూడా ఓ బత్తా గింజలు కొల్రా!" అన్నాడు పెద్దకాపు.

"ఎవరీమడిసీ!" అన్నాడు వియ్యంకుడు. పెద్దకాపుకి ఓ చుట్టను అందిస్తూ.

"మావూరి కమ్మరి గన్నిగాడు"

"మీ ఊళ్ళో రెండు పార్టీలనుకుంటాను. రెండు పార్టీలకు సరిపెడతన్నడా?"

"నోరూ వాకూలేని సన్నాసి. పైగా పెళ్ళీ పెడాకులూ లేవు. ఏదో ఇద్దర్నీ ఆడే సక్కబెడుతున్నాడు." అన్నాడు పెద్దకాపు.

"మా వూళ్ళో మాకమ్మరి నాగయ్య సెల్లెలుంది, సంబంధం కుదరక సత్తన్నాడు. ముడేయించేత్తే యిద్దరూ పడుందురు." అన్నాడు మునసబు - చుట్టపొగ గాలిలోకి వదులుత్తా.

యింతలో గన్నెయ్య ధాన్యం కొలిపించుకొని బస్తా మూతిని తడపతో బిగించి, పెదకాపు దగ్గరకొచ్చి, "వత్తానండి బాబు" అన్నాడు.

'అది సరేగాని గన్నిగా! ఎల్లకాలం యిల్లాగే ఆంజనేలు సామిలా వుండి పోతావేట్రా? నీకింకా ఆడదాని మీద బేవార్రలేదేట్రా?' అన్నాడు పెద్దకాపు నవ్వుతూ.

గన్నెయ్య సిగ్గుపడి తలవంచుకున్నాడు. 'నే యెల్లొత్తానండి.' అంటూ ధాన్యం బస్తావైపు రెండడుగులేసాడు.

'యీ గింజలన్నీ పోగుచేసి ఏటి సేత్తావురా? ఒక్క సన్నాసికీ పోగే తెందుకురా!' అన్నాడు పెద్దకాపు.

'ఏటికేడాదీ గడాలిగా? పైగా కొలిమిలోకి బొగ్గులు కొనాలి' అన్నాడు గన్నెయ్య ఎంతో నమ్రతతో.

'పోనీలేగాని మా ఇయ్యంకుడు వూళ్ళో పిల్లవుందట. తిరం సెయ్యమంటావేట్రా?' అన్నాడు పెద్దకాపు.

'ఏమోనండి నాకు తెల్దు' అంటూ అడుగులు తడబడుతూ బస్తా దగ్గరకి వెళ్లి, నెత్తిని పెట్టుకుని వెళ్ళిపోయాడు గన్నెయ్య.

"సెట్టంత మడిసని పేరేగాని ఆడపిల్లకంటె సిగ్గుపడి పోతున్నాడయ్యా" మీ కమ్మరి - అన్నాడు మునసబు, చుట్టని పళ్ళమధ్య నొక్కిపట్టి.

'బాగా సెప్పారు?' అన్నాడు పెద్దకాపు.

గన్నెయ్య ఆ ధాన్యం బస్తాను తిన్నగా షావుకారు లక్ష్మీపతి యింటికి తెచ్చి, అరుగు మీద దింపాడు.

'ఎన్ని కుంచాల్రా?' అన్నాడు లక్ష్మీపతి.

'నే కొల్లేదండె. కొల్చేటప్పుడు లెక్కెట్టునూ లేదు?' అన్నాడు గన్నెయ్య తనేదో పొరబాటు చేసినట్లు.

'నే తరువాత కొలిపించి, నీపేర జమ కడతానులే?' అన్నాడు లక్ష్మీపతి.

గన్నెయ్య కదలకుండా యింకా అలా నిలబడ్డం చూసి, 'ఏరా? యింకా నిలబడ్డావే?' అన్నాడు లక్ష్మీపతి.

'అబ్బే మొత్తం ఎంత పోగయిందో చూత్తారేమోననీ...' అని నసిగాడు గన్నెయ్య.

'ఏవిటెంత పోగయ్యిందో చూడమంటావు?'

'అదేనండి – డబ్బు.'

'అదా! రొండొందలుంటుందిర. ఏం? కొలిమిని కార్ఖానాకింద మారుద్దామనుందా?' అన్నాడు, వ్యాపారం దృష్టి తప్ప మరో ఆలోచనలేని లక్ష్మీపతి.

'అబ్బే నా మొగానికి కార్ఖానా కూడానా? ఊరికినే అడిగానండి మరినే వత్తానండి. సంచీ, సందా లట్టికెడతా లెండి' వచ్చేశాడు అక్కణ్ణుంచి.

'ఏడేళ్ళు కట్టబడితే రెండొందలు పోగైనాయన్నమాట!' అనుకున్నాడు.

గన్నెయ్య తన పొట్టకి పోగా మిగిలిన ధాన్యాన్ని ఏటా లక్ష్మీపతికి అమ్మేస్తాడు. అలా ఏడేళ్ళబట్టి అమ్మితే రెండువందలు పోగయ్యాయి. అవసరమైనప్పుడు లక్ష్మీపతి దగ్గరనించే గన్నెయ్య రూపాయీ, రెండూ తీసుకోడం అలవాటు.

సావిడికి వెళ్లే దారిలో రామస్వామి కాఫీహొటల్ పాక అగుపించింది గన్నెయ్యకి. కాఫీ హొటల్ కనపడగానే నోరూరింది. వారానికో, పదిరోజులకో ఓసారి వచ్చి, అరడజన్ ఇడ్డెన్లు తిని, ఓ గ్లాసు మంచినీళ్ళు తాగిపోవడం గన్నెయ్యకి అలవాటు.

పాకలోకి దూరాడు గన్నెయ్య.

పొరాటు చెక్కబల్లమీద కూర్చుని, సగం మూతలు పడిన ఎర్రని కళ్ళను పప్పు రుబ్బుతూన్న రామస్వామి పెళ్ళాం మీద నిలిపి, పచ్చిమిరపకాయ బజ్జీలు తింటున్నాడు తాగుబోతు చిన్నిగాడు.

రామస్వామి పెళ్ళాం వీరమ్మ పెసరట్ల పప్పు రుబ్బుతూంది. గన్నెయ్యరాక గమనించి, 'బేర వచ్చినాది సూడయ్యోవ్!' అంది రామస్వామి నుద్దేశించి.

'నువ్వు సూడకూడదేటే!' అన్నాడు రామస్వామి, బజ్జీలు మూకుట్లోవేస్తూ.

'నేను పనిమీదుంటే ఎట్టాగేటి సూసేది?' అంది కాస్త కోపంగా.

రామస్వామి చేతులు కడుక్కుని, తడి చేతుల్ని వీరమ్మ మీద దులుపుతూ, 'దీని కీమధ్దెమరీ జోరెక్కువైపోయిందిరా!' అన్నాడు గన్నెయ్యతో.

మీదపడిన నీళ్ళను తుడుచుకుంట 'బాగానే ఉంది సడసం' అని మూతి మూడు మెలికలు తిప్పి, వచ్చే నవ్వు ఆపుకుంటూ ఒయ్యారంగా పప్పుజోరుగా రుబ్బడం మొదలెట్టింది.

గన్నెయ్యకి వాళ్ళిద్దరి సరసం సిగ్గనిపించింది. ఇంతలో రామస్వామి ఇడ్లెన్ల ప్లేటు గన్నెయ్య కందించాడు.

☆ ☆ ☆

గన్నెయ్య కమ్మరిసాలకి చేరుకున్నాడు. పెద్దకాపు ఇచ్చిన ప్రోత్సాహం, షావుకారు లక్ష్మీపతి 'రెండు వందలు దాకా పోగయ్యుంటాయిరా' అని అన్నమాట, రామస్వామి, వీరమ్మల సరసం – ఒకదాని తరువాత ఒకటి గన్నెయ్య మనసులో చక్రంలా తిరిగాయి.

గన్నెయ్య మనసులోని కోరికల తేనెపట్టు చెదిరింది. ఇదివరలో ఎప్పుడేనా గన్నెయ్య మనసులో ఏదేనా కోరిక పుడితే కొలిమిలో పడిన చెమట బిందువులా ఆవిరైపోయేది. ఇప్పుడీ కోరిక అలాకాకుండా చెరువులోని తామరాకుమీది నీటిబొట్టులా మిలమిల మెరుస్తూ మనసులో ఆడుకుంటూంది.

మరునాడు సాయంత్రం గన్నెయ్య మళ్లీ పెద్దకాపు దగ్గరికి వెళ్ళాడు. విప్పి చెప్పకపోయినా, గన్నెయ్య మనసు నర్థం చేసుకొన్నాడు పెద్దకాపు. గన్నెయ్య నుద్ధరించడానికి కాకపోయినా వియ్యంకుడి దగ్గిర మెహర్బానీ కోసం వియ్యంకుడు చెప్పిన సంబంధాన్ని స్థిరపరిచాడు పెద్దకాపు.

గన్నెయ్య పెళ్ళి నిశ్చయమైంది. పెళ్ళికూతురు పేరు రత్నం. వాళ్ళ ఊళ్ళో వాళ్లకి రత్నం చదువుకున్న పిల్లకింద లెక్క, ఎనిమిదో క్లాసుదాకా ఊళ్ళోఉన్న బడిలోనే చదువుకుందిట. రత్నం తెలివైందీ, చలాకీ అయిందీ, అందమైందీ అనుకునేవారంతా. ఏమైనా రత్నం పసిడి బొమ్మలా చూడముచ్చటగా ఉంటుంది.

రత్నం చిన్నతనంలో, రత్నం సవతి అన్నగారు తల్లీ తండ్రిలేని లోటు లేకుండా రత్నాన్ని కళ్ళల్లో పెట్టుకుచూసుకున్నాడు. రానురాను అతని సంసారమూ పెరగడంతో, భార్య సూటిపోటీ మాటలతో రత్నం బరువయింది అతనికి. రత్నానికి తను అన్నగారికి బరువయ్యానని తెలియగానే, తనకి తనే బరువైనట్లనిపించింది. దానితో పెళ్ళి కుదిరిందనగానే గన్నెయ్య అందగాడు కాకపోయినా, మోటు మనిషే అయినా రత్నం మనసు తేలికైంది. కట్నం లేకుండా పెళ్ళి కొప్పుకున్న గన్నెయ్యలో బతికున్న దేవుణ్నే చూసింది రత్నం.

పెళ్లి దేవుడిముందే జరిగింది. ఆ పెళ్లికి మేళతాళాలు, బంధువులు, విందులూ అన్నీ దేవుడే. అయినా గన్నెయ్య రెండు వందల రూపాయలతోబాటు, ఏడేళ్ళ కష్టమూ కరిగిపోయింది.

దాని ఫలితంగా ఒక ఏడాదినుంచి రత్నం గన్నెయ్య ఊరుమ్మడి కమ్మరి సావిట్లో మసులుతూంది. రత్నాన్ని చూసి గన్నెయ్య మురిసిపోయాడు. ఆమె అందాన్ని చూస్తూ, ఆమె మృదువైన మాటల్ని వింటూ ఒక్కో రాత్రి నిద్ర పొయ్యేవాడు కాదు. ఆమె నేదో అందల మెక్కించాలనీ. పువ్వులమీద నడిపించాలనీ అతని మనసు ఆరాటపడేది.

రత్నానికీ ఆశలేమీ లేవు. గన్నెయ్యని తన మనసుకీ, ఆ సావిడికీ రాజులా చూసుకునేది రత్నం. అతనిని సుఖపెట్టడమే తన జీవితాని కర్థం అనుకుంది

రత్నం. వెలుగు రాకుండానే అన్ని పనులు చూసుకుని, ఓ ఏడాదిపాటు ఎవరి కంటా పడకుండా ఆ చిన్న గదిలోనే మగ్గింది రత్నం. పెద్ద అర్భాటము, అల్లరి లేకుండానే రత్నం బిడ్డతల్లి అయింది. అప్పటి నుంచి ఊరు తనకి కాస్త పాత కావడంతో, సావిట్లోకి రావడం మొదలుపెట్టింది రత్నం.

అనాటి నుంచి సావిడికి రద్దీ మరీ పెరిగిపోయింది. ఇదివరలో పాలేర్లూ, పనిలేనివాళ్ళూ రావడమే రివాజు కాని, ఇప్పుడు పెద్ద పార్టీకి పెద్దైన కిష్టయ్య, చిన్న పార్టీకి పెద్దైన రవణయ్యకూడా సావిడి దగ్గరే ఉంటున్నారు.

పళ్ళు, పువ్వులు, పాలు - గన్నెయ్య ఇంటినిండా పడుంటున్నాయి. కిష్టయ్య పట్టణానికివెళ్ళి, వచ్చేటప్పుడు ఇంటికైనా వెళ్లకుండా సరాసరి సావిడి దగ్గిరికివెళ్ళి, నాలుగైదు స్వీట్స్ పొట్లాలు పడేసిపోయేవాడు. చిన్న పార్టీ పెద్ద రవణయ్య పండగలకి పబ్బాలకీ, ఓ మంచి చీర, రవికల గుడ్డ పట్టుకువచ్చి, 'నువ్వు కొనలేవురా, గన్నిగా! దానిది కట్టుకునే ఈడు. ఇదిగో ఈ సీర కట్టుకోమను రేపుపండక్కి' అని ఇచ్చిపోయేవాడు.

గన్నెయ్య వద్దందా మనుకునేవాడు.

'పోనీలే. ఆళ్ళ ముచ్చటాళ్ళది. ఊరి పెద్దలు' అని సరిపెట్టుకునేవాడు.

☆ ☆ ☆

ఆ ఊళ్ళో చిన్నపార్టీకి, పెద్ద పార్టీకి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది. రెండు పార్టీల వాళ్ళకి గన్నెయ్యే కమ్మరి.

ఓసారి, చిన్నపార్టీ పెద్ద - రవణయ్య నాగలి - అన్నరోజుకి తయారుకాలేదు. పెద్దపార్టీ పెద్ద కిష్టయ్య దగ్గిరుండి తన పని చేయించుకోవడంతో, రమణయ్య పని ఆలస్యమయ్యింది.

దానితో రమణయ్య ఆ సాయంత్రం గన్నెయ్య ఇంటి మీదికి వచ్చి "ఏరా, గన్నిగా? ఒళ్ళు పొగరెక్కిందేట్రా? తస్సాదియ్యా, పెళ్ళాన్ని చూసుకుని పనెగ్గొట్టేత్తన్నావ్! బొవిక లేరేత్తాను-సూడు!" అంటూ మీదిమీది కొచ్చాడు.

రత్నం కంగారుపడి, బయటికి వచ్చి, "రేపిచ్చేస్తార్లేండి. బాబూ! ఈ రాత్రంతా అయినా పనిచేసి, రేపు సాయింత్రానికల్లా మీ పని పూర్తి చేస్తారు" అంటూ రవణయ్యని సముదాయించింది.

"సరే! సూత్తాను. నీ మొగం సూసి ఊరుకుంటున్నాను" అని విప్పిన పడగని ముడుచుకుని వెళ్లిపోయాడు రవణయ్య.

మరునాడు పని లేకపోయినా సావిడి దగ్గిరికి వచ్చిన కిష్టయ్య, "ఏరా, గన్నిగా? రవణయ్యకి సమాధానం చెప్పలేక పెళ్ళాన్ని అడ్డెట్టుకున్నావంట! ఆడేవన్నా తల తీసేత్తాడా? నేలేననుకున్నావా?" అన్నాడు, ఏదో తాను గన్నెయ్యకి పెద్ద అండ నన్నట్టు.

గన్నెయ్య ఏం మాట్లాడలేదు.

"కాసిని మంచీలియ్యే రత్నం!" అన్నాడు కిష్టయ్య నిశ్శబ్దాన్ని చీలుస్తూ.

రత్నం మంచినీళ్ళు తెచ్చి యిచ్చింది.

మంచినీళ్ళిస్తున్న రత్నాన్ని ఎగాదిగా చూసి, "దీనికి రోజు రోజుకీ మరీ అందమొత్తుందిరాగన్నిగా! ఏం తినిపిత్తన్నావోగాని" అన్నాడు కిష్టయ్య పెద్ద చమత్కారంలా.

ఆ చమత్కారానికి చుట్టూ ఉన్న జనం ఫకాలించి నవ్వారు.

చుట్టూ ఉన్న ఇనుపముక్కల్లా, దుంగల్లా మనుషుల నైజం కూడా కటువుగా అనిపించింది గన్నెయ్యకి. కొలిమిలో కాలుతూన్న తొళ్ళిక ఊచ తీసి గుండెలో గుచ్చుకోవాలనిపించింది గన్నెయ్యకి, చేతగాక, చేసేదిలేక నవ్వి ఊరుకున్నాడు.

అవమానాలకీ, చివాట్లకీ, బెదిరింపులకీ అతనికి చేతనైన జవాబు ఆ నవ్వే! అదే అతనికి చేతనైన పెద్ద ప్రతీకారం. "పెద్దపార్టీ కిట్టయ్య కన్నడితే, ఇంకా రంగొత్తది గన్నిగా, నీ పెళ్లానికి" అన్నాడు తాగుబోతు చిన్నిగాడు, కిష్టయ్య దగ్గిర నుంచి సాయంత్రం తాగుడికి ఓ పావలా గుంజవచ్చన్న ఆశతో.

కిష్టయ్య ముసిముసి నవ్వులు నవ్వుకున్నాడు.

రత్నం మనసు కరిగిన ఇనుములా పొగలు కక్కింది. ఆ ఉక్రోషాన్ని అణుచుకోలేక, లోపలికి పోయి కళ్ళ నీళ్ళు కుక్కుకొని నులక మంచం పట్టికేసి తల బాదుకొంది.

గన్నెయ్య ఏమి విననట్టు చింతచెట్టువైపు చూశాడు. పిల్లలు చింతకాయలు కోసుకుంటున్నారు. చెట్టులెక్కలేని వాళ్ళు కిందనుంచే రాళ్ళతో కాయలని కొట్టుకుంటున్నారు.

'నేను ఊరుమ్మడి మనిషిని. నా బతుకు ఊరుమ్మడి బతుకు. నాలాగే నువ్వూ ఊరుమ్మడి దానివి. నన్నూ, నిన్నూ ఎవరేం చేసినా, ఎవరేమన్నా అడిగేవోడు లేడు. మనం మాట్లాడలేం!' అని గన్నెయ్య మనసు చెట్టుతో చెప్పుకుంది.

'నేను ఊరుమ్మడి కమ్మరిసాలలో బతుకుతున్న ఊరుమ్మడి మడిసినే. ఊరుమ్మడి మడిసి పెళ్ళాంకూడా ఊరుమ్మడిదే కామోసు!' అనుకున్నాడు గన్నెయ్య నిస్పృహోయంగా.

కిష్టయ్య చేతికి దొరికిన చీపురు పుల్లతో నేలమీద పాకుతున్న చీమని వేటాడుతున్నాడు.

'నాలు గెకరాల కొండ్ర, ఓ మండువా లోగిలో, మేడో మిద్దో ఉంటే నా పెళ్ళాన్ని అంత మాటనగలిగే వోడేనా కిట్టయ్య' అనుకున్నాడు గన్నెయ్య.

'ఆత్తి, అంతత్తు లేనోడికి అందమైన ఆడది కూడా బరువే' అనుకున్నాడు మనసులో గన్నెయ్య.

చీమను వేటాడుతున్న కిష్టయ్యకి చిన్నిగాడన్న మాటలు – "కిష్టయ్య కన్నడితే ఇంకా రంగొత్తద గన్నిగాడి పెళ్ళానికి" గుర్తుకి వచ్చాయి.

'మిగల ముగ్గితె పండు రుసి పోద్దా' అనుకున్నాడ కిష్టయ్య.

చీపురుపుల్ల దెబ్బ చీమకి తగిలి చీమ విలవిల తన్నుకుంటూంది. కిష్టయ్య ఉన్నట్టుండి లేచి, నోటిలో నానిన చుట్టని నేలకేసి కొట్టి, తుపుక్కున ఉమ్మేసి, "ఒరేయ్, గన్నిగా! సందాలోపాలింటికిరా. నువ్వూ, మా సుబ్బడూ బత్తీకెళ్ళి బండిరుసు కొనుక్కుద్దురుగాని" అని చెప్పి వెళ్ళిపోయాడు.

"అల్లాగేబాబూ!" అని మాత్రం అనగలిగాడు గన్నెయ్య.

అనుకున్న ప్రకారం ఆ సాయంత్రమే – గన్నెయ్య, కిష్టయ్య పాలేరు సుబ్బడు బండి ఇరుసు కొనడానికి బస్తీకి ప్రయాణమై వెళ్ళిపోయారు. తిరిగి మరునాడు ఉదయానికికాని రాలేరు.

చీకటి పడింది. ఊరు మాటు మణిగింది.

కిష్టయ్య ముస్తాబై, చుట్ట పొగ వదులుతూ కమ్మరి సాలవైపు బయలుదేరాడు. వీధి అంతా సెంటువాసన కమ్మింది. సావిడి దగ్గర జనం అలికిడి లేదు. సావిట్లోకి అడుగులో అడుగు వేసుకుంటూ వెళ్లి 'రత్నం!' అని పిలిచాడు, కిష్టయ్య.

"ఎవరూ?" అంది రత్నం లోపలి గదిలోనుంచే.

"నేనే నే కిష్టయ్యని."

"వస్తున్నానుండండి" అంటూ తలుపుతీసి, "ఆయనింకా రాలేదండి" అంది రత్నం.

"అడితో నాకేం పనుందిగాని, నువ్వు లోనికినడు....నీతో కాత్త మాటాడే పనున్నాది" అన్నాడు కిష్టయ్య.

"నాతోనా?" అంది రత్నం కాస్త ఖంగారుపడి.

"నీతోనేనే. సదువుకున్నావన్న మాటేగాని, నీకు బొత్తిగా తెలివి లేదేటే, ఎర్రిమొగవాఁ".

"అబ్బే, ఆయనకోసం వచ్చేరేమో అనుకున్నాను." అంది రత్నం, ఏం మాటాడాలో తెలియక.

"ఇదెక్కడిదిరా గొర్రిలాగ? సెప్పినమాట అరదం సేసుకోదు, నువ్వు లోనకి నడు, నే సెపుతాను" అంటూ రత్నాన్ని లోనికి నడిపించాడు కిష్టయ్య.

మంచం మీద కూర్చున్నాడు. చంటిది వేరే చిన్న మంచంమీద నిద్దట్లో ఉంది.

"నాకాడ సెంటోసన కొడతందా నీకు?" అన్నాడు కిష్టయ్య సంభాషణ ఎలా మొదలెట్టాలో తెలీక.

"ఆ"

"ఎట్టాగుంది? బాగుందా?"

"ఆఁ." అంది రత్నం వణకుతున్న కంఠంతో.

"అలా బొమ్మలా నిలబడిపోతావటే? ఇల్లా పక్కకొచ్చి కూకో. అడిప్పుడప్పుడే రాడులే" అంటూ రత్నం చెయ్యి పట్టుకుని, దగ్గరికి లాక్కోబోయాడు కిష్టయ్య.

"వదలండి, వదలండి" అంటూ చెయ్యి విదిలిపించుకుందుకు పెనుగులాడింది రత్నం.

రత్నం పెనుగులాడిన కొద్దీ, కిష్టయ్య శరీరం వేడెక్కిపోతూంది. బలంగా ఒక్క గుంజు గుంజి, సందిట్లోకి తీసుకుని మంచంమీదికి రత్నం కళేబరాన్ని వాల్చడానికి ప్రయత్నిస్తున్నాడు కిష్టయ్య.

"నేనల్లాటిదాన్ని కాదు. నన్ను వదలండి. మీకు దణ్ణం పెడతాను" అంటూ ఎంతో ప్రాధేయపడింది రత్నం.

రత్నం మాట లతనికి ఏమీ వినిపించకపోయినా, ఆ గోలకి కేర్ మంటూ పిల్ల లేచింది.

"దీని తస్సాదియ్యా ఇదొకత్తి - పానకంలో పుడకలాగ" అని చిరాకు పడ్డాడు కిష్టయ్య.

"ఉండండి. పిల్లని నిద్దరోగొట్ట నివ్వండి" అంటూ అతని పట్టులోంచి వదిలిపించుకో ప్రయత్నించింది రత్నం.

"హిహిహి. అల్లా రా దారికి" అంటూ సందిట్లోంచి వదిలిపెట్టాడు రత్నాన్ని కిష్టయ్య.

ఒక్క అడుగులో పిల్ల నెత్తుకుని గదిలోంచి బయటపడింది రత్నం.

"అరిస్తే తన పరువే పోతుంది. అరవకపోతే ఈ రాక్షసుడు వదిలేలాలేడు. ఏమిటి దారి?" అనుకుంటూ చింతచెట్టు కిందున్న తుమ్మదుంగల దగ్గరికి వచ్చి వణికిపోతూ చీకట్లో కూర్చుంది.

కాసేపు చూసి, కిష్టయ్య - కొత్త చుట్ట ముట్టించి బయటకి వచ్చాడు.

"ఇలాంటి బెట్టుసరి సేత్తే, కూటికి గుడ్డకి కరువైపోతావు. రేపే మరో కమ్మర్ని పిలిపించి, వేరే కొలి మెట్టిత్తాను. ఆలోచించుకుని కబురు సెయ్. అదీ సంగతి" అంటూ విసురుగా వెళ్లిపోయాడు కిష్టయ్య.

'కండలు కరిగేలా రెక్కలు ముక్కలు చేసుకున్నందుకు కాదన్నమాట కూడూ, గుడ్డావచ్చేది. కూడూ, గుడ్డా కావాలంటే కాయకష్టంతో పాటు వీళ్ళాడించినట్టల్లా తోలుబొమ్మలా బతకాలన్నమాట ఛీ! వెధవబతుకు! నా బతుకుకంటె తుమ్మదుంగ నయం. ఈ చుట్టూవున్న ఇనుపముక్కలు నయం. స్వేచ్ఛగా ఆరుబయట నిర్భయంగా పడున్నాయి. ఈ బొందిలో ప్రాణం పోతే నాకూ ఈ దుంగకు తేడా ఏమిటి? నేనందంగా పుట్టడమే నేరమైంది. కాదు, అందంగా పుట్టి, పేదవాడి పెళ్ళాన్ని కావడమే పెద్ద నేరం. నేనూ తుమ్మదుంగలా నల్లగా, అసహ్యంగా ఉంటే, ఈ దుంగలా నిర్జీవంగాఉంటే' అని ఏవేవో ఊహించుకొని తనలో తను బాధపడుతూంది రత్నం.

ఇంతలో ఒడిలోని పాప చలికి ఏడుపు మొదలెట్టింది. ఒక్కసారి పాపని గుండెలకి హత్తుకుంది. కారే కన్నీరు తుడుచుకుంది. కాని, ఆ కన్నీరు ఆగడం లేదు.

వీధివెంట విసురుగా పోతున్న కిట్టయ్యకి తాగుబోతు చిన్నిగాడు ఎదురయ్యాడు.

"ఏం కిట్టయ్య బాబూ! ఏడనుంచేటి ఇంత సీకటి నొత్తన్నావ్! కమ్మరసాల కాడనుంచి కాదుకందా? ఆడనుంచే అయి ఉంటాది. లేకపోతే ఆ సెంటోస నెందుకేటి?" అని కిష్టయ్య సమాధానం కోసం ఆగకుండా తన మనసులోని అనుమానాన్ని వెళ్ళగక్కాడు చిన్నిగాడు.

"ఏదిసేవులే" అని చిరాకు పడ్డాడు కిష్టయ్య.

"ఓసుట్టో టాడెయ్, కిట్టయ్య బాబూ!"

కిష్టయ్య చుట్ట తీసి ఇచ్చాడు.

"అగ్గిపెట్టెకూడా పారెయ్ మరి" అన్నాడు చిన్నిగాడు.

అగ్గిపెట్టె తీసుకుని, పుల్లగీసి, "పిట్టవల్లో పడ్డట్టేనా?" అన్నాడు చిన్నిగాడు చుట్ట ముట్టిస్తూ.

"ఇంకా కొత్త. కొత్తబెట్టు సేత్తందిరా"

"నన్ను రామంటావేటి? సేతులూ, కాళ్ళూ కదపకుండా మంచానికి కట్టి పాడేత్తాను. ఆపైన నీ యిట్టం" అన్నాడు చిన్నిగాడు, వాడి మూర్ఖత్వమంతా వెల్లడయ్యేలా, కిష్టయ్య మెప్పుకోసం.

"ఏడిశావులే. ఎవరేనా వింటే బాగోదు. ఆ సమయం వచ్చినప్పుడు చెబుతాలే. ఎల్లిరా" అంటూ ముందుకి నడిచాడు కిష్టయ్య.

"నేలమీద కోడిపిల్ల గద్దకంట పడ్డదీ. గన్నెగాడి రత్తనం కాపుకంట పడ్డదీ" అని పాడుకుంటూ తాగుబోతు చిన్నిగాడు కమ్మరిసాల వైపు వెళ్ళిపోయాడు.

ఆ పాట విన్న రత్నానికి గుండెలదిరినట్లయి, రెండంగల్లో గదిలోపడి, తలుపులు బిగించి, పాపను పక్కలో పెట్టుకుని ఏడుస్తూ పడుకుంది. ఎప్పుడు గన్నెయ్య వస్తాడా, ఒళ్ళోపడి భోరున ఎప్పుడేడుద్దామా అని రత్నం గుండెలు తహతహ లాడుతున్నాయి. మనసు వేయి కళ్ళతో ఎదురుచూస్తోంది.

మరునాటి పొద్దున్నకి గన్నెయ్య పట్నంనుంచి తిరిగి వచ్చాడు. కళ్ళువాచి నీరసంగా ఉన్న రత్నాన్ని చూశాడు.

"అలాగున్నావేంవే? అన్నాడు."

"…. …. …."

"నిన్నే నే నడిగేది."

రత్నం మాట్లాడలేకపోయింది. వచ్చే ఏడుపు నాపుకోలేక. మధ్యమధ్య ఎగుపులతో – "ఈ ఊరునుంచి పారిపోదాం. ఇక్కడ మనం ఒక్కరోజుకూడా ఉండద్దు" అంది రత్నం పసిపిల్లలా.

"ఇన్నాలబట్టీ నచ్చినూరు ఈయేల యెగట్టై పోయిందేటే? అసలు ఏం జరిగినాదో సెప్పకుండా ఆ ఏడుపేటే?" అన్నాడు గన్నెయ్య కాస్త చిరాగ్గా.

"రాత్రి మీరింటి దగ్గర లేరుగా. కిష్టయ్య నానా రభసా చేశాడు….సమయానికి చంటిది ఏడవబట్టిగాని…లేకపోతే నేను మీకు దక్కేదానినే కాదు."

"ఏం? సంపబోయాడా? నిన్ను సంపితే అయన కేటొత్తాది?"

"నా కర్మ మిమ్మల్ని మనిషిగా పుట్టించినాడికి బుద్ధి లేదు….నన్ను సందిట్లోకి బలవంతంగా లాక్కుని, గట్టిగా…" అంటూ చెప్పలేక ఇంకా ఏదో చెప్పబోయింది రత్నం.

"ఛా నోర్మ్ముయాస్" అని అరిచాడు గన్నెయ్య.

వాళ్ళిద్దరి రెండేళ్ళ దాంపత్య జీవితంలో గన్నెయ్య నోట అంత బిగ్గరగా మాట వినడం రత్నానికి మొదటిసారి. అది మాటలా అనిపించలేదామెకి, ఆ ఒక్కసారి ఆకాశం భయంకరంగా ఉరిమినట్లనిపించిందామెకి. ఆ క్షణంలో అతని ముఖంలో ఒక వింతైన క్రౌర్యాన్ని చూసింది. బురద పాములా అగుపించే గన్నెయ్యలో కోడెతాచును

చూసింది. రత్నం కుంగిపోయిన మనసు, ఒక్కసారి చిరుగాలికి విరిసిన పువ్వులా తుళ్లింది.

'నా మొగుడూ మగసిరి గలవాడే! ఆ మెలితిరిగిన కండలు ఇనుప ముక్కల్ని, కర్రల్ని సాపు చెయ్యడానికే కాదు. నన్ను కాపాడ్డానికి కూడా పనికొస్తాయన్నమాట?' అనుకుని పొంగిపోయింది రత్నం.

'కిట్టయ్య దుట్టిలో పేదోడికి అందమైన పెల్లాం ఉండకూడదన్నామాట ఒకేల ఉన్నా, అది ఆడికోసమే ఉండాలి. అంతేగాని పతివరతగా ఉంటానికి వీల్లేదు. ఉన్నా ఉండనివ్వడు అది సెడిపోయి తీరాలి. సెడిపోకపోతే సెరిపి తీరతాడన్న మాట. సూత్తా వీడి సంగతి' అని హుంకరించాడు గన్నయ్య.

"మాటల సందట్లో మరిచిపోయాను. భోజనానికి లేవండి" అంది రత్నం కళ్ళు తుడుచుకుని.

"వద్దే, కడుపు నిండుగానే వుంది" అని కొలిమిదగ్గర కూర్చుని, రాజబెట్టాడు.

'ఇన్నాళ్ళబట్టీ ఈడు ఆడే యకసిక్కాలకి అర్థం ఇదన్నమాట' అనుకున్నాడు.

కొలిమిలోని కణకణలాడే బొగ్గుల్లా అతని గుండెలు రగులుతున్నాయి. కాలిన నాగలి కరుకోలని కొలిమిలోంచి తీశాడు. ఎర్రగా కాలిన కరుకోలని ఇనప దిమ్మమీద పెట్టి సమ్మెటతో కసిగా బాదుతున్నాడు.

'ఆ కరుకోల కిట్టయ్యే అయితే.......' అనిపించిందతనికి.

☆ ☆ ☆

సోమరిగా బతకడమే బతుకుతెరువుగా పెట్టుకున్న తాగుబోతు చిన్నిగాడు, పొద్దున్నే రవణయ్యదగ్గిరికి చేరి, రాత్రి జరిగిన సంగతంతా చెప్పాడు.

"ముసలి కిట్టయ్యంటే ఎగటేసిందేమో దానికి – నువ్వంటే, తస్సాదియ్య ఉరకలేత్తూ వల్లో పడద్ది" ధూపమేశాడు చిన్నిగాడు. రమణయ్య నవ్వుకున్నాడు.

"ఓ పావలా ఇయ్యి రవణయ్యా! ఓ సుక్కేసుకో పోతే మడసు బాగోదు" అని, పావలా చేతిలో పడగానే సారాబడ్డీవైపు వెళ్ళిపోయాడు చిన్నిగాడు.

పొద్దువాలే వేళ రవణయ్య కమ్మరి సావిడిదగ్గిరికి వచ్చాడు ఓ దుంగమీద తాపీగా కూర్చుని. 'ఒరేయ్. గన్నిగా! ఈ ఏల సందాలడ్డాక ఇంటికొచ్చి, డబ్బట్టుకెళ్ళి పట్టంనుంచి బండిపట్టాలు కొనుక్కు రావాలిరా నువ్వు. సెక్కుతున్న ఆ నాగలెవరిదిరా?' అన్నాడు.

'దొరయ్య కాపుగారిది. బాబూ!'

"చంటి దేదిరా?"

"లోనాడుకుంటున్నాదేమోనండి."

"పిలోపాలి"

"రత్నం, సంటిదాన్ని తీసుకురాయె" అని పిలిచాడు గన్నయ్య.

రత్నం పిల్లని తీసుకువచ్చింది.

"కళ్ళు అలా ఉన్నాయేవేఁ గన్నిగాడు ఇంటికాడ లేక నిద్దురట్టలేదా నిన్న మాపు?" అన్నాడు రవణయ్య రత్నం ముఖంలోకి చూస్తూ.

రత్నం సమాధానం చెప్పకుండా పిల్లని తీసుకుని లోపలికి వెళ్ళిపోయింది. ఆ ఊరి జనమంతా రాక్షసుల్లా తోచారు రత్నానికి. ఈ ఊరినుంచి ఏమైనా వెళ్ళి పోవాలని మనసు తహతహ లాడింది రత్నానికి.

గన్నెయ్య ఒళ్ళు ఉడికిపోతోంది. తనకున్న బలానంతనీ, ఉబుకుతూన్న ఉక్రోషాన్ని అణచుకుందుకు వినియోగిస్తున్నాడు.

"బాబూ!" అన్నాడు గన్నెయ్య నెమ్మదిగా.

"ఏరా?"

"పోనీ...రేపెళ్లకూడదూ?"

"ఏం? పెద్ద గేదెకి పాలితకాలా నువ్వు? రాత్రికెళ్ళి పొద్దున్నకి పట్టాలు కొనుక్కురావో, పెద్ద నీలక్క" అని సమాధానం కోసం ఎదురుచూడకుండా వెళ్ళిపోయాడు రవణయ్య.

'ఈయనే గేదెపాలు పితకాలి? పితకటానికి పాలేళ్ళున్నారుగా. ఈయనెల్లకూ డదూ?' అనుకున్నాడు గన్నెయ్య.

పక్షులు గూటికి చేరుతూన్న సమయం గన్నెయ్య చొక్కా తొడుక్కున్నాడు. ఎప్పుడేనా పట్నాని కెడితేనే తొడుగుతాడా చొక్కా.

రత్నం అతని దగ్గరికి వచ్చి, "మనం ఈ ఊరునుంచి వెళ్ళిపోదాం. ఈ పని ఇంకే ఊళ్ళోనైనా చేసుకు బతకొచ్చు" అంది, అతనికి నచ్చచెప్పే ధోరణిలో.

"నీకు తెల్దే, పని సేత్తానంటేమట్టుకు ఏదుందే? మరనాగళ్ళొచ్చాయ్. మిసనుమీద కత్తులు సేత్తున్నారు. కొడవళ్ళు సేత్తన్నారు. అన్ని ఊళ్ళల్లోనూ, అందరు సద్దుకు బతుకుతున్నారు. మనం యాడకెళ్ళి బతుకుతామే? రోజులు మారిపోయినాయే" అన్నాడు గన్నెయ్య నిస్పృహాయంగా, ఈ నరకం నుంచి విముక్తి లేనట్టు.

"మరనాగళ్ళు వచ్చాయ్, రోజులు మారాయి, కాని, మన బతుకుల్లో మాత్రం మార్పులేదు. బతుకులు బాగుపడవు" అంది రత్నం.

"ఎవడు ఏది సేసినా; బాగున్నోడి బతుకు బాగుపడటానికేనే."

"మనవేం పాపం చేశాం?"

"పాపమో పున్నెమో నాకు తెల్దు కానీ, పుట్టిన అవు దూడలన్నీ ఎగిరి గంతులేసి అడుకుంటాయి సిన్నప్పుడు. పెద్దయినాక కొన్ని దూడలు ఎద్దులై - సచ్చినట్టు బండచాకిరీ సేత్తయ్. కొన్ని దూడలు అబోతు లౌతాయ్. అన్నీ ఒకేలా పుట్టినా, పెద్దయ్యేసరికి రకరకాలుగా మారిపోతాయే" అన్నాడు గన్నెయ్య, పెద్ద తాత్త్వికుడిలా.

"అబోతునీ మనిషేగా చేసింది" అంది రత్నం.

"ఏమోనెహే! నీ మెట్టవేదాంతం నువ్వూనూ" అంటూ గదిలోంచి సావిట్లోకి వచ్చాడు గన్నెయ్య.

గన్నెయ్య వెంటబడి, "ఎద్దులన్నీ కలిసి ఆబోతుమీద తిరగబడితే?" అని ప్రశ్నించింది.

"ఎద్దులేటే? ఆబోతుమీద తిరగ బడడమేటే? నీకు మతిగాని పోందేటే" అని ఒక్కడుగు ముందుకు వేశాడు.

తనమాట వినిపించుకోవడం లేదన్న రోషంతో, "ఈ రాత్రి మళ్ళీ ఆ కిష్టయ్య వచ్చి రభస చేస్తే మీరు నాశవాన్నే చూసేది" అని లోపలికి వెళ్ళిపోయింది రత్నం.

గన్నెయ్యకి అడుగు ముందుకు పడలేదు. నిలబడిపోయి ఎదురుగా ఉన్న చింతచెట్టువైపు చూశాడు.

చింతచెట్టు కొమ్మల్లో ఉన్న కాకిగూడు దగ్గరికి బావురు పిల్లి నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ చేరుతూంది. ఇంక నాలుగడుగులు వేస్తే ఆ గూట్లోని కాకిపిల్లని నోట కరుచుకుంటుంది. అలా జరగడం మామూలే. కాని, అలా జరగలేదు. ఎక్కడనుంచో రెండు కాకులు "కావ్! కావ్" మని అరుస్తూ పిల్లిని చుట్టుముట్టాయి. పిల్లి చలించలేదు ఒక్క అడుగు ముందుకువేసింది అంతే. కాకులు మీద పడ్డాయి. వాటి ఇనపముక్కులతో పిల్లి కళ్ళలో పొడిచాయి. పిల్లికి దిక్కుతోచక నేలకూలింది. ఇంక కదల్లేదు.

గన్నెయ్య బరువుగా తృప్తిగా నిట్టూర్చాడు. మనసులో కాకుల్ని మెచ్చుకున్నాడు. తనకన్న కాకులు నయమనుకున్నాడు. గన్నెయ్య తిరిగి లోపలికి వెళ్ళిపోయాడు. రత్నాని కేదో చెప్పబోయాడు. కాని తమాయించుకున్నాడు.

"రత్నం! నాగుండెల్లో పాణాలుండగా నీ ఒంటిమీద ఈగ వాలనివ్వనే నామాట నమ్ము. నేనెక్కడికి ఎళ్ళినా నీకాడే ఉన్నాననుకో" అని చెప్పి, రవణయ్య ఇంటికేసి బయలుదేరాడు. దార్లో కిష్టయ్య పాలేరు ఎదురయ్యాడు.

"ఎక్కడకండి. గన్నెయ్యగోరా?" అన్నాడు.

"పట్నం ఎడతన్నాను. రవణయ్య కాపు పనిమీద" అన్నాడు గన్నెయ్య.

రవణయ్య ఇంటికి వెళ్ళి డబ్బు తీసుకొని బయలుదేరాడు. ఒకమైలు నడిస్తేగాని, పెద్దరోడ్డు రాదు. పెద్దరోడ్డు ఎక్కితేగాని, బస్సు దొరకదు. గన్నెయ్య చురుగ్గా పెద్దరోడ్డువైపు నడుస్తున్నాడు, దార్లో మునసబుగారెదురయ్యారు.

"ఎక్కడికిరా గన్నీ, సందాలడ్డాక బయలుదేరావ్?" అన్నాడు మునసబుగారు మామూలు ధోరణిలో.

"బండిపట్టా కోసం పట్నాని కెడతన్నానండి, రవణయ్య గారెల్లమన్నారు" అని ముందుకు నడుస్తున్నాడు గన్నెయ్య.

మాలపల్లి దాటాడు ఎదర సెట్టిబల్జీ పేటుంది.

"మాలపల్లిని, సెట్టిబల్జీ పేటనీ రవణయ్య, కిష్టయ్య సొంతంలా వాడుకొంటారు. వాళ్ళమాట కెదురు చెప్పరు వీళ్ళెవరూ. వాళ్ళిద్దరూ ఏం చేసినా ఈ కూలీజనం మాట్లాడలేరు. వాళ్ళ కవతాలమీద బతికేవాళ్ళు. ఒళ్ళొంచి పనిచేసుకు బతికినా, ఆకామందు లిద్దరి మోచేతికింద నీళ్ళు తాగి బతుకుతున్నారని ఆ కామందుల నమ్మకం, తనలాగే వాళ్ళూ – ఆ కామందు లిద్దరూ ఏం చేసినా, ఏవన్నా నోరు

మెదపరు. చేతకాని సన్నాసులు. కాకులపాళం చెయ్యరు! ఎదవ బతుకులు! ఈళ్ళంతా తిరగబడితే, – ఈళ్ళతరమేటి? అళ్ళకాడ డబ్బుంది. ఈళ్ళకాడ తిండిలేదు. అళ్ళు ఎక్కువోళ్లు. ఈళ్ళు తక్కువోళ్ళు. ఊళ్ళో అళ్ళ బలగమెక్కువుంది. ఈళ్ళజనం ఊళ్ళో తక్కువ. అళ్ళ డబ్బుకి అమ్ముడిపోయి నోళ్ళు, అందుకే ఇల్లా ఏడుతున్నారు. సన్నాసిగాళ్ళు" అనుకుంటూ ఏవేవో ఆలోచించుకొంటూ పెద్ద రోడ్డెక్కాడు గన్నెయ్య.

బస్సు కొద్దిసేపట్లో వచ్చింది. అకాస్త ఆలస్యం గన్నెయ్యకి యుగంలా గడిచింది. ఒక గంటలో బస్తీకి చేరుకున్నాడు. పట్టాలు కొన్నాడు, అప్పడే తొమ్మిదిగంటల రాత్రి అయింది. ఇంక బస్సులుండవు. గన్నెయ్య పట్టాలు భుజాన వేసుకుని నడక ప్రారంభించాడు. రత్నానికి తనిచ్చినమాట చెవుల్లో మారుమోగుతోంది, రత్నాన్ని తను కాపాడుకోవాలన్న అత్రుతత అతన్ని పరిగెత్తిస్తోంది. ఏదేనా జరిగితే...రత్నం అన్నంతపనీ చేస్తే, రత్నం శవాన్ని....దాన్ని గురించి ఆలోచించుకో లేకపోయాడు. కిట్టయ్య అంతటివాడునూ, మళ్లీ రాత్రికి వస్తే రావచ్చు. వాళ్ళ పాలేరుకూడా చూసాడు తను పట్నానికి పోవడం. రవణయ్యని మాత్రం ఎవరు నమ్ముమన్నారు! ఇద్దరిద్దరే. వాళ్లిద్దరి మీద ఎన్ని పుకార్లు లేవూ?

గన్నెయ్యకి భయమేసింది, ఈ వెర్రి ఆలోచనలు అతని గుండెల్లో రాక్షసి బొగ్గులా రగులుతున్నాయి. అతను రైలింజనులా ముందుకు దూసుకుపోతున్నాడు. వెళ్ళి కమ్మరిసాల దగ్గర వాలిపోవాలనుంది. రెండు గంటల్లో పన్నెండు మైళ్ళు.... భుజాన బరువుతో.......ఊరు చేరుకున్నాడు. చెమటలు కారుతున్నాయి. ఒళ్ళంతా వేడెక్కిపోయింది.

కమ్మరిసాలలోకి అడుగు పెట్టాడు. పట్టాలు దించాడు. రెండడుగులు ముందుకు వేశాడు. గదితలుపు తెరచి వుంది. గుడ్డిదీపం మిణుకు మిణుకు మంటోంది చిన్నగా మాటలు వినపడ్డాయి.

"పండక్కి పట్టుచీర కొంటానే. బెట్టుచెయ్యకు. నా మాట విను."

"నన్నొదలండి. దణ్ణం వెడతాను."

గన్నెయ్య గుండెల్లో రగులుతున్న ఆలోచనలు కడిగిన నిజాల్లా కళ్ళముందు నిలబడ్డాయి.

మంచంమీద రత్నం కళేబరాన్ని అణచిపెట్టి, రవణయ్య పశుత్వాన్ని ప్రదర్శిస్తున్నాడు. రాక్షసత్వం ఆ గదిలో రాజ్యమేలుతోంది.

గన్నెయ్య నరాలు తెగిపోయేటంతగా పొంగాయి. రక్తం వేడెక్కిపోయింది. కోపంతో ఒళ్ళు వణికిపోతూంది. నోట మాట రానంత కోపం కట్టలు తెంచుకుని ముందుకి దూకింది. చిరకాలంగా నలిగిపోతూన్న పీడిత సహనం ఒక్కసారి తిరగబడింది.

రత్నంమీద పడి పెనుగులాడుతూన్న రవణయ్య జుట్టు పట్టుకొని సావిట్లోకి విసిరాడు గన్నెయ్య. సావిట్లో కటిక నేలమీద రవణయ్య కళేబరం దిబ్బున పడింది. రవణయ్య గుండెల మీద గన్నెయ్య కూర్చున్నాడు. చేతికి దొరికిన కరుకోలని బలంగా పిడికిలిలో బిగించాడు. ఆ చేతిలోని ఆయుధాన్ని చూసి రవణయ్యలోని

పాత జులుం, అహం, మదం – అన్నీ కరిగిపోయాయి. దైన్యం, ప్రాణభీతి, అడకువ – అన్నీ ఒక్కసారి ముంచుకొచ్చాయి.

గన్నెయ్యని ప్రాధేయపడి ప్రాణాలు దక్కించుకోవాలనుకున్నాడు. అతని నోట మాట బయటపడని క్రితమే గన్నెయ్య చేతిలోని కరుకోల రవణయ్య గుండెల్లోకి బలంగా దిగి, బయటికొచ్చింది.

రవణయ్య విలవిల తన్నుకుని, నిశ్శబ్దంగా గాల్లో కలిసిపోయాడు.

రత్నం గది గుమ్మానికి బల్లిలా అంటిపెట్టుకుపోయింది. ఆ తరువాత వంతు తనదే ననుకుంది. దీపం భయపడి ఆరిపోయింది. గన్నెయ్య కరుకోలని యింకా వదల్లేదు. అతనిలో పిరికితనం చచ్చిపోయింది. అతని రక్తనాళాల్లో ప్రవహించేది అప్పుడు రక్తం కాదు, కరిగిన లావా. అతనిలో మొండి ధైర్యం కోట కట్టుకొని రాజ్య మేలుతూంది.

చుట్ట నేలను కొట్టి కిష్టయ్య సావిట్లోకి అడుగు పెట్టాడు. గుమ్మందాకా వెళ్ళాడు. వెనుకనించి ఓ బలమైన చెయ్యి నోరు మూసి సావిట్లోకి లాక్కు వచ్చింది.

రవణయ్యకి పట్టిన గతే కిట్టయ్యకు పట్టింది.

"తలుపేసుకుని లోన పడుకో" అన్నాడు గన్నెయ్య.

గది తలుపులు తక్షణం మూసుకుని, వణికిపోతూ మంచాన్ని అంటిపెట్టుకుని, నోట మాట రాక బొమ్మలా పడుకుంది రత్నం.

కాకులు 'కావ్ కావ్'మంటున్నాయి.

'ఖూనిరా! ఘోరమైపోయిందిరా' అన్న కేకలు. జనం! సావిడినిండా జనం!

'రత్నం రత్నం' అంటూ ఎవరో తలుపు తట్టారు.

రత్నం తలుపు తీసింది. రవణయ్య శవం, కిష్టయ్య శవం సావిట్లో పడున్నాయి. పక్కనే రక్తంతో తడిసిన కరుకోల.

వెలుగొచ్చింది. మునసబు పంపిన బకీరుమీద పోలీసులు వచ్చేశారు.

అప్పటికే ఊరు రెండుగా విడిపోయింది. పెద్దపార్టీ ఓ పక్క చిన్న పార్టీ ఓ పక్క సమావేశమయ్యాయి. పెద్ద పార్టీపెద్ద కిష్టయ్యని, చిన్న పార్టీ పెద్ద రవణయ్య హత్య చేశాడనీ, చిన్న పార్టీ పెద్ద రవణయ్యని పెద్ద పార్టీ పెద్ద కిష్టయ్య హత్య చేశాడని నిర్ణయమైపోయింది.

మునసబు చిన్నిగాడి సాక్ష్యాన్ని ఆసరాగా తీసుకొని, రత్నంతో కిష్టయ్యకీ, రమణయ్యకీ ఉన్నసంబంధమే ఈ హత్యలకి కారణమని పోలీసుకి విడమరచి చెప్పాడు. హంతకుడూ? హతుడూ కూడ హతులేనని చట్టం నమ్మింది.

గన్నెయ్య బండిపట్టాలు భుజాన వేసుకుని వచ్చాడు. జనాన్ని పోలీసుల్ని చూసి తెల్లబోయాడు. మాటాడకుండా బొమ్మలా నిలబడిపోయాడు.

ఆచేతగాని దద్దమ్మని ఎవ్వరూ అనుమానించలేకపోయారు.

జనం సద్దణిగారు.

రత్నం చెడిపోయిందని ఊరు చెప్పుకుంటూంది.

ఎవరు చెరచడానికి ప్రయత్నించారో, రవణయ్య, కిష్టయ్య సావిడి దగ్గరికి ఎందుకెళ్ళారో ఊరు పట్టించుకోలేదు.

గన్నెయ్య చింతచెట్టుమీది కాకిగూడుని చూస్తున్నాడు.

"మనం ఈ ఊరు వదలి వెళ్ళిపోదాం, మనకీ ఊరుమ్మడి కమ్మరిసాలా వద్దు, ఈ ఊరుమ్మడి చాకిరీవద్దు" అంది రత్నం నెమ్మదిగా.

"ఈ ఊరు మనదేనే. ఈ ఊరే ఉమ్మడి ఊరు. నాకూ వాటా ఉందే ఈ ఊళ్ళో" అంటూ రత్నం భుజం మీద చెయ్యివేసి లోపలికి తీసుకెళ్లాడు గన్నెయ్య.

చెట్టుమీది కాకిగూట్లో – సురక్షితంగా ఉన్నాయి కాకిపిల్లలూ, కాకులూ.

★ ★ ★